సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 12 : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వారికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను గురువారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి వారికి అందజేశారు. నారాయణఖేడ్ మండలం నమ్లిమేట్ గ్రామానికి చెందిన శంకరయ్య, పటాన్‌చెరుకు చెందిన పండరి, నాగల్‌గిద్ద మండలం పీర్యానాయక్ తండాకు చెందిన రాథోడ్ రావణ్, కంగ్టి మండలం చాప్టా(కె)కు చెందిన మూల్గె శివకుమార్‌లకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం వర్తించని పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలను ఆదుకునే దిశగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సహకారంతో చెక్కులను మంజూరు చేయించి అందజేస్తున్నట్లు చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ : కల్హేర్ మండలం ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మణ్, కంగ్టికి చెందిన ప్రభులు అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతుండగా, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారిని కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి ఉన్నారు.

ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కంది, జూన్ 12 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కంది మండల పరిధిలోని బేగంపేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని, లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని విడతల వారీగా డబ్బులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈజీఎస్‌లో అవినీతికి పాల్పడితే చర్యలు

సిర్గాపూర్, జూన్ 12 : ఉపాధి హమీ పథకంలో అవినీతి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీఏ అదనపు పీడీ బాలరాజు హెచ్చరించారు. గురువారం సిర్గాపూర్ రైతు వేదికలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్‌పై ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో గతేడాది 1 ఏప్రిల్ 2024 నుంచి, 31మార్చి - 2025 వరకు మొత్తం రూ. 3,47,44,000 నిధులు ఖర్చు చేయగా, దీంట్లో రూ.1.90 లక్షలు మెటీరియల్ వర్క్స్‌కు ఖర్చు చేసినట్లు ఎస్ఆర్‌పీ రాజు వెల్లడించారు. అనంతరం ఒక్కో జీపీ వారిగా డీఆర్పీలు చేపట్టిన సామాజిక తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. కొన్ని చోట్ల జరిగిన పొరపాట్లను బహిర్గతం చేశారు. అయితే ప్రజాదర్బార్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నది. డీవీవో నాగేశ్వర్‌రావు, ఏపీడీ రాజు, ఎస్‌టీఏం సంతు, ఎంపీడీవో మల్సూర్ నాయక్, ఏపీవో బ స్వరాజ్, టీఏలు, ఎఫ్‌ఏ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగింత

పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ వినాయకరెడ్డి

పటాన్‌చెరు, జూన్ 12: పటాన్‌చెరు పట్టణంలో దారి తప్పి తిరుగుతున్న ఐదు మంది పిల్లలను వసతి గృహంలో ఉంచి సమాచారం సేకరించి తల్లిదండ్రులకు అప్పగించమని ఎస్‌హెచ్‌వో వినాయకరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో ఐదు మంది పిల్లలు దారి తప్పి తిరుగుతున్నారని సమాచారం రావడంతో వారి వసతి గృహంలో ఉంచి తల్లిదండ్రుల సమాచారం సేకరించగా, బీహర్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. పోలీసు స్టేషన్‌కు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి పిల్లలను అప్పగించమన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నూతన్ కుమార్

మనూరు, జూన్ 12 : విత్తనాలు విక్రయించే విషయంలో తగిన జాగ్రత్తలు వహించాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్ అన్నారు. గురువారం మనూరు రైతు వేదికలో ఫర్టిలైజర్ డీలర్‌లతో సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడారు. రైతులకు గుర్తింపు పొందిన విత్తనాలు అమ్మడంతో పాటు ఒరిజనల్ బిల్లులు మాత్రమే ఇవ్వాలని అన్నారు. నకిలీ విత్తనాలకు తావు లేకుండా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తప్పవని, విత్తనాలు ఎరువులు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మహేశ్ చౌహన్, ఏఈవో సంగమేశ్వర్, డీలర్‌లు శంకర్, జైపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మారుతి, రాజయ్య స్వామి, రాఘవేందర్ రెడ్డి, పవన్, సురేశ్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు విరాళం

విగ్రహ ఏర్పాటు నిర్వాహకులతో బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 12 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మాదారంలో నూతనంగా 33 అడుగుల పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. గురువారం విగ్రహ ఏర్పాటు నిర్వాహకులు ఆర్సీపురం డివిజన్‌లోని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి విగ్రహ ఏర్పాటు గురించి వివరించారు. నిర్వాహకుల కోరిక మేరకు విగ్రహ ఏర్పాటుకు తనవంతు సాయంగా రూ.1,16,000లను విరాళం అందజేస్తామని ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ఏర్పాటు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ్‌రెడ్డిని కలిసిన గాయకుడు మిట్టపల్లి సురేందర్

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డిని ప్రముఖ రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి ఆయనను ప్రత్యేకంగా శాలువ కప్పి సన్మానించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదర్శ్‌రెడ్డిపై గాయకుడు మిట్టపల్లి సురేందర్ ప్రత్యేకంగా ఓ పాటను తయారు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గాయకుడు సురేందర్ ఆయనతో బేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, బూన్, వేణు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

భూ సమస్యలకు రెవెన్యూ సదస్సులు

గుమ్మడిదల, జూన్ 12: భూసమస్యలకు రెవెన్యూ సదస్సులు పరిష్కారం చూపుతాయని తహసీల్దార్ పరమేశం అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు మున్సిపల్ వార్డులో తహసీల్దార్ పరమేశం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఇందులో భూసమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించబడుతాయని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐలు శ్రీనివాస్‌రెడ్డి, పవన్ కుమార్, మాజీ సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు అండగా 'భూ భారతి'

కలెక్టర్ వల్లూరు క్రాంతి

వట్‌పల్లి, అందోల్ జూన్ 12 : రైతులకు అండగా భూ భారతి చట్టం ప్రభుత్వం తెచ్చిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. అందోల్, వట్‌పల్లి మండలంలోని నేరడిగుంట, పోతుబోగుడ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టంతో భూ సరిహద్దుల మధ్య గొడవలు ఉండవని, భూములుకి భూఆదార్, అక్షాంశాలు రేఖాంశాలతో పక్కగా హద్దులు ఏర్పాటు చేసుకొవచ్చన్నారు. డిజిటల్ సర్వేకు ఎం పికైన షా ద్‌నగర్‌లో డ్రోన్లతో భూకొలతలు నిర్వహించే విధానాన్ని కలెక్టర్ ప్రారంభించారు.

పోతులబోగులో అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్

వట్‌పల్లి మండలంలోని షాద్‌నగర్‌లో కొన్నేండ్లుగా విద్యార్థుల కొరతతో ముతపడిన ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ పున: ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలలోనే ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులచే విద్యా బోధన ఉంటుదన్నారు. నాణ్యమైన చదువుతో పాటు సకల వసతులు విద్యార్థులకు ప్రభుత్వం అందింస్తుందన్నారు. పోతులబోగుడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు అదేశించగా, ఉపాధ్యాయుల సమధానానికి కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అమ్మ మాట ఆంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా అందుబాటులో లేక పోవడంపై సంబదిత అధికారులపై మండి పడ్డారు. వెంటనే విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు.

పోతులబోగుడలో విద్యార్థులకు పాఠ్యాపుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ముగిసిన సుందరమ్మతల్లి జాతర

ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, జూన్ 12 : హత్నూరలో మూడురోజులుగా కొనసాగుతున్న ఏరువాక పౌర్ణమి సుందరమ్మ తల్లి జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. సాయంత్రం ఆలయం వద్ద పాచిబండ్ల ఊరేగింపు నిర్వహించారు. సుందరమ్మతల్లి జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. జాతర ఉత్సవాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

హత్నూరలో సుందరమ్మతల్లి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మక్కల కొనుగోలు ఏర్పాటు చేయాలి

వెంకటాపూర్‌లో మక్కలను బస్తాల్లో నింపుతున్న రైతులు

కోహీర్, జూన్ 12 : రైతన్నలు శ్రమకోర్చి పండించిన మక్క జొన్నలు వర్షానికి తడుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పండించిన మక్కలను సకాలంలో కొనుగోలు చేయడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ధాన్యం సేకరణకు కల్లాలు లేక పోవడంతో రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. వర్షపు నీటి నుంచి తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో లేక రైతులు కన్నీరు పెడుతున్నారు. కండ్లముందే ధాన్యం తడుస్తున్నా ఏమీ చేయలేని దుస్థితి రైతన్నలది. గతంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం సేకరించారు. రైతుల నుంచి కొనుగోలు చేశారు. మూడేండ్లుగా కొనుగోలును నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వం మక్కల కొనుగోలు గు రించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. కనీ సం వర్షానికి ధాన్యం తడువకుండా టార్పాలిన్లను అందించాలని వారు విన్నవించారు. మక్కల కొనుగోలు విషయం గురించి ఐకేపీ ఏపీఎంను వివరణ కోరగా, తాము డ్వాక్రా సంఘాల మహిళలు పండించిన ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. మిగతా వాటిని జహీరాబాద్ మార్కెట్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు.

భారంగా పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణ

కంగ్టి, జూన్ 12 : గ్రామపంచాయతీల్లో నిధులు లేవని, ట్రాక్టర్లను మెయింటెనెన్స్ చేయడం మాకు తలకు మించి భారమైందని కంగ్టి మండలంలోని పలుగ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ట్రాక్టర్ల తాళాలను ఎంపీవో సుభాష్‌కు అందజేశారు. కొన్ని నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పంచాయతీ బిల్లులు రాకపోవడంతో అన్ని పంచాయతీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో కనీసం వీధి దీపాలు కూడా స్తంభాలకు పెట్టని పరిస్థితి నెలకొనడంతో గ్రామకార్యదర్శులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు కనీసం 10 లీటర్ల వరకు డీజిల్ అవసరం ఉండడంతో డీజిల్ కూడా పోయని పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నది. పంచాయతీల్లో పని చేసే కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లకు నెలనెలా జీతం కూడా సక్రమంగా రాకపోవడంతో ట్రాక్టర్ నిర్వహణ భారగా మారింది. దిక్కు తోచక ట్రాక్టర్ల తాళాలను అందజేసిట్లు వారు పేర్కొంటున్నారు.

కారులో చెలరేగిన మంటలు

సంగారెడ్డి జూన్ 12 : సంగారెడ్డి పట్టణంలోని బాలాజీనగర్‌లో ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు రేగాయి. మంటలతో కారు ఇంజన్‌భాగం మొత్తం దగ్ధమైంది. ఈప్రమాదయంలో ఎవరి ఎటువంటి హానీ జరగలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మనోజ్‌రెడ్డి గురువారం తన నివాసం నుంచి కారులో సదాశివపేట వెళ్లేందుకు బయలుదేరారు. మనోజ్‌రెడ్డి నడుపుతున్న కారు బాలాజీనగర్‌లోని రుషి హైస్కూల్ సమీపంలోకి చేరుకోగానే ఇంజన్‌లో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను చూసి అప్రమత్తమైన మనోజ్‌రెడ్డి వెంటనే కారు నుంచి బయటకు వచ్చేశారు. క్షణాల్లో ఇంజన్ ముందుభాగంలో మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే సమాచారాన్ని ఫైర్ సిబ్బంది తెలియజేశారు. సంగారెడ్డి ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలంకు చేరుకుని కారులో చెలరేగుతున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కారు ఇంజన్‌లో ఎలక్ట్రికల్ సమస్య తలెత్తిన కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని ఫైర్ అధికారులు తెలిపారు.

బొమ్మారెడ్డిగూడెంలో బీఆర్ఎస్ నేతల పూజలు

విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి

చౌటకూర్, జూన్ 12 : మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో వెలిసిన సంత్ తపస్వి రామ్‌రావు మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు బీఆర్ఎస్ నేత, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి గురువారం హాజరయ్యారు. స్థానిక గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు రోజులుగా ఆలయ 20వ వార్షికోత్సవాలు కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. బీఆర్ఎస్ యువత విభాగం నాయకుడు పల్లి ఉదయ్ బాబూమోహన్, నాయకులు రఘునాయక్, లాల్‌సింగ్‌నాయక్, రాణా, శేఖర్, సంతోశ్ రెడ్డి, తి లక్‌నాయక్, ప్రవీణ్ రాథోడ్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా కేసుల పరిశోధన చేయాలి

గజ్వేల్, జూన్ 12: పారదర్శకంగా కేసుల పరిశోధన చేయాలని ఏసీపీ కె.నర్సింహులు సూచించారు. గురువారం ఏసీపీ కార్యాలయంలో డివిజన్ పోలీస్ అధికారులతో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన కేసుల పరిశోధన ఏస్థాయిలో ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆత్మహత్యల కేసులపై పారదర్శకంగా పరిశోధన చేసి అందుకు గల కారణాలను తెలుసుకొని నివారణ కోసం కౌన్సెలింగ్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు చోటుచేసుకునే బ్లాక్ స్పాట్లను గుర్తించాలన్నారు. గంజాయి మత్తు పదార్థాలపై నిఘా ఉంచాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు. సమావేశంలో సీఐలు సైదా, ముత్యంరాజు, మహేందర్‌రెడ్డి, లతీఫ్ పాల్గొన్నారు.

సెల్ఫీల కోసం ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు

మర్కూక్,జూన్12: యువకులు సరదా కోసం ప్రాజెక్టుల వద్దకు వెళ్లి లోతు తెలియకుండా సెల్ఫీల కోసం వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అన్నారు. కొండపోచమ్మ సాగర్ వద్ద గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన పెట్రోలింగ్ చేశారు.

రైతుభరోసా, రైతుబీమా అందించాలి

కోహీర్, జూన్ 12 : వక్ఫ్ బోర్డు రికార్డుల్లో నమోదైన రైతులకు ప్రభుత్వ పథకాలను అందించాలని కోహీర్ మండల రైతులు తహసీల్దార్ వర ప్రసాద్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 468మంది రైతుల సొంత భూములు వక్ఫ్ భూములుగా నమోదు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము హైకోర్టుకు వెళ్లడంతో గత ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా అందించిందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిరాధారంగా వాటిని నిలిపివేసిందన్నారు. వన్‌బీ, పహణీ లు రావడం లేదన్నారు. రైతుభరోసా, రైతుబీమా అందించేందుకు చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



కోహీర్‌లో తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాఠశాలలకు యూనిఫామ్ అందజేత

గుమ్మడిదల, జూన్ 12 : బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలకు విద్యార్థుల యూనిఫామ్‌లను అందజేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పునఃప్రారంభమైన పాఠశాలల్లో రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ రమణ కుమార్ మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఎంపీపీఎస్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారని ఎంఈవో రాంబాబు తెలిపారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా పాఠశాలలు పున:ప్రారంభమైనాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలకు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

మోడల్ స్కూల్లో పుస్తకాలు పంపిణీ

జిన్నారం, జూన్ 12 : తెలంగాణ మోడల్ స్కూల్‌లో పుస్తకాలను పంపిణీ చేసింది.

విద్యార్థులకు, యూనిఫాంలను అందజేసిన రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ రమణకుమార్

గురువారం జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీలోని టీజీఎంఎస్ పాఠశాల, కళాశాలలో, చెట్లపోతారంలో తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్సిటిట్యూట్ సొసైటీ స్టేట్ లెవల్ స్పెషల్ ఆఫీసర్ రమణ కుమార్ పుస్తకాలను, స్కూల్ డ్రస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 12 : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ అన్నారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిరోధక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 14 ఏండ్లలోపు బాల బాలికలను ప్రమాదకరమైన పనులలో నియమించరాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్య కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

ఆరుగురు నిందితులను పట్టుకున్న బీడీఎల్ పోలీసులు

పటాన్‌చెరు రూరల్, జూన్ 12 : పాశమైలారం పారిశ్రామికవాడలో ఏప్రిల్ 17న ఉషా మాగ్‌వైర్స్ అనే పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న ఖైరాత్ మియా (54) సెక్యూరిటీ గార్డ్ హత్యకు గురయ్యాడు. రెండు నెలలుగా బీడీఎల్ పోలీసులు చేసిన ఇన్వెస్టిగేషన్‌లో ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో హత్యకు గల కారణాలను, నిందితుల గురించి వివరాలు అందజేశారు. సదాశివపేటకు చెందిన ఖైరాత్‌మియా పాశమైలారం ఉషా పరిశ్రమ వద్ద సెక్యూరిటీ గార్డ్ విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో కాపర్‌వైర్ల కోసం ఉషా పరిశ్రమకు వచ్చిన దొంగలను చూడటంతో దొంగలు ఆయనను హత్య చేశారు. బొంతపల్లి గ్రామానికి చెందిన మొహ్మద్ మాజిద్, రోషన్‌కుమార్, మొహ్మద్ సద్దాం, వికాస్ కుమార్ పాల్, ఎల్లాకుల్ల నర్సింగ్‌రావు, వుప్పునంతల వినిత్‌కుమార్‌గౌడ్ స్నేహితులు. ఏ1గా ఉన్న బిట్టు మైనర్. ఈ ఏడుగురు మిత్రులు క్రికెట్ అటద్వారా వారు పరిచయమై స్నేహితులయ్యారు. వీరికి జల్సాలు చేయడం, తాగడం కూడా అలవాటయ్యింది. బిట్టు అనే మైనర్ బాలుడు జల్సాలకు డబ్బులు సరిపోవడం లేదని, కాబట్టి దొంగతనాలు చేస్తేనే డబ్బులు వస్తాయని మిత్రబృందాన్ని తెలిపాడు. తాను ప్లాన్ ఇస్తానని తనను అనుసరించాలని సూచించాడు. వీరందరూ హత్యకు ముందు ఒక రోజు దొంగతనం కోసం ఉషా మాగ్‌వైర్స్ ఇండియా పరిశ్రమకు వచ్చారు. అక్కడ సెక్యూరిటీ ఉండటంతో వెనక్కి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితిలో వైర్లు దొంగలించాలని ఏప్రిల్ 17న అర్ధరాత్రి సమయంలో వాహనాలపై ఉషా పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. పరిశ్రమలో వెనుకభాగం నుంచి గోడదూకి కొందరు లోపలికి వెళ్లారు. అలజడి గుర్తించిన సెక్యూరిటీ గార్డు ఖైరాత్ మియా వారిపైపు టార్చ్‌లైట్ వేశారు. ఇది గమనించినవారు ఎక్కడ తమను గుర్తిస్తాడో అనే అనుమానంతో ఖైరాత్‌మియాపై దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. ఈ నేరంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితుడు రోషన్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తే హత్య గుట్టు బయటపడింది. వీరిలో బాలుడు పరారీలో ఉన్నాడని డీఎస్పీ వివరించారు. మిగిలిన అరుగురు నిందితులను పోలీసులు పట్టుకుని కోర్టుకు హాజరుపర్చారు. ఈ హత్య కేసును ఛేదించిన సీఐలు శివకుమార్, డీ స్వామిగౌడ్, రామానాయుడు, ఎస్సై శ్రీకాంత్, ఎస్సై లక్ష్మారెడ్డి, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుల్ అన్వర్, శశి, సలీమ్, మోహన్, ప్రశాంత్, సతీశ్‌లను డీఎస్పీ అభినందించారు.

సెక్యురిటీ గార్డ్ హత్య కేసు నిందితులను చూపిస్తున్న పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

సంగారెడ్డి, జూన్ 12 : బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి సౌజన్య అన్నారు. గురువారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి సౌజన్య హాజరై బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని గోడ పత్రిక విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప కార్మిక అధికారి రవీందర్‌రెడ్డి, డీసీవో రత్నం, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ లాల్ అహ్మద్, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ యాదగిరి, అసిస్టెంట్ లేబర్ అధికారి యాదయ్య, సుప్రియ, స్కోప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మానయ్య, రామగౌడ్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

రాయికోడ్, జూ 12 : గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని సింగితం,రాయిపల్లి(సి)కర్చల్ గ్రామంలో బాడి బాటలో పాల్గొని మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలన్నారు. అన్ని పాఠశాలలో విద్యార్థులకు నో